ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 జయశంకర్ భూపాలపల్లి

గురువారం 10 జూలై 2025

ఏఎస్పీకి అతి ఉత్కృష్ట సేవా పతకం



అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్

కృష్ణకాలనీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి అదనపు ఎస్పీ నరేష్ కుమార్ అతి ఉత్కృష్ట సేవా పథకానికి ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 1991లో ఎస్సైగా విధుల్లో చేరిన నరేష్ కుమార్ పదోన్నతులతో అడిషనల్ ఎస్పీగా కొనసాగుతున్నారు. సమర్థంగా ఇన్వెస్టిగేషన్ చేపట్టి నిందితులకు జీవిత ఖైదు పడేలా కృషి చేయడంతో ఆయన్ను ప్రభుత్వం ఈ పతకానికి ఎంపిక చేసింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డీజీపీ చేతుల మీదుగా ఈ పతకాన్ని ఆయన అందుకోనున్నారు. గతంలో సైతం సేవా పథకం, కఠిన సేవా పథకంతోపాటు ప్రెసిడెంట్ గ్యాలంటరీ మెడల్‌ను ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్‌ను ఎస్పీ కిరణ్‌ఖరే అభినందించారు.

వరద విపత్తుపై అవగాహన

వాజేడు, జూలై 9(ఆంధ్రజ్యోతి): వరద విపత్తుపై ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు బుధవారం అవగాహన కల్పించారు. మండలంలోని లోతట్టు, సరిహద్దు గ్రామమైన టేకులగూడెంలో ఈ కార్యక్రమం జరిగింది. వరదలు వచ్చినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ఇంట్లో ఎలాంటి వస్తువులతో బయటొచ్చు అనే అంశాలపై గ్రామస్థులకు ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి జగదీశ్ అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో అధికారులు ఇచ్చే సూచనలు, పునరావాస కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గోదావరి వరదల సమయంలో చేపల వేటకు, పశువులను మేపేందుకు అడవులకు వెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, జీపీ కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'కమలం' వికసించేనా?

- పూర్వ వైభవంపై పార్టీ శ్రేణుల్లో ఆసక్తి
- ఇన్‌చార్జులపై కేడర్‌లో తీవ్ర అసంతృప్తి
- త్వరలోనే అనుబంధ సంఘాలను ప్రక్షాళన చేసే అవకాశం!



దళపతి మారారు.. బీజేపీ దశ మారేనా..?

భూపాలపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని ఆశిస్తున్న బీజేపీ కొంత కాలంగా తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడింది. బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఆ పార్టీకి కొంత మేరకు జవసత్వాలు సమకూరినట్లు కన్పించినా ఆ తర్వాతి పరిణామాల్లో ఆయన్ను పక్కన పెట్టడంతో పూర్వ స్థితికి చేరుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్ రావును నియమించటంతో పార్టీలో ఇక సమూల ప్రక్షాళనలు ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీకి ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ తర్వాత కాస్తోకూస్తో భూపాలపల్లి జిల్లా పరిధిలోనే కొంత కేడర్ ఉంది. అయితే.. నాయకత్వ సమస్య కారణంగా ఇక్కడ పార్టీ ఎదగలేకపోతోందనే అభిప్రాయం ఉంది. బీజేపీ నాయకత్వం ఎన్నికల సమయంలో మాత్రమే పార్టీపై దృష్టి పెడుతుందనే వాదన కూడా ఉంది. ఫలితంగా ఎన్నికల్లో టికెట్లు ఆశించే నాయకులు కొంత కాలం హడావుడి చేసి కార్యకర్తలను ఇటు పార్టీ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారన్న అసంతృప్తి కమలం శ్రేణుల్లో స్పష్టంగా కన్పిస్తోంది.

జిల్లా పరిధిలో భూపాలపల్లి, మంథని శాసన సభ నియోజకవర్గాలు ఉన్నాయి. మంథనికి సంబంధించి ఐదు మండలాలు మాత్రమే భూపాలపల్లి జిల్లా పరిధిలో ఉన్నాయి. మరో నాలుగు మండలాలు పెద్దపల్లి జిల్లా పరిధిలో ఉండగా, ఇక్కడ నాయకుల మధ్య సమన్వయం సమస్య తీవ్రంగా ఉందని తెలుస్తోంది. ఇక భూపాలపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన కీర్తిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి మధ్య సమన్వయం కొరవడిందని అంటున్నారు. ఇటీవల జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల్లో రాష్ట్ర నాయకత్వం మరో సారి నిశీధర్‌రెడ్డికే జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతలను కట్టబెట్టింది. మరో వైపు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన కీర్తిరెడ్డి అడపా దడపా నియోజకవర్గంలో పర్యటిస్తున్నా కేడర్‌పై ఆమెకు పట్టులేదని చెబుతున్నారు. నియోజకవర్గంలో ఎంత మంది కార్యకర్తలున్నారు? ఎక్కడెక్కడ బలమైన పార్టీ నిర్మాణం ఉందనే విషయంపై కూడా ఆమెకు సరైన అవగాహన లేదని తెలుస్తోంది. దీంతో కార్యకర్తలు ఆమె నాయకత్వం పట్ల కొంత అసంతృప్తిగా ఉన్నట్లు చెబుతున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన వారే వచ్చే శాసన సభ ఎన్నికల వరకు పార్టీ కార్యక్రమాలకు బాధ్యులుగా వ్యవహరించే ఆనవాయితీ ఉందని, కానీ ఇక్కడ ముఖ్యమైన నేతలు, కార్యకర్తలను కూడా పట్టించుకోవటం లేదని అంటున్నారు. ఈ క్రమంలో నిశీధర్‌రెడ్డి, కీర్తిరెడ్డిల మధ్య వర్గ పోరు కొనసాగుతోందంటున్నారు. అటు మంథని నియోజకవర్గంలోనూ పెద్దపల్లి జిల్లాకు సంబంధించి సునీల్‌రెడ్డి కీలకంగా వ్యవహరిస్తుండగా, ఇటు భూపాలపల్లి జిల్లా వైపు నారాయణరెడ్డి పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తుండటంతో ఇక్కడ కూడా బీజేపీలో స్పష్టమైన చీలిక కన్పిస్తోందని చెబుతున్నారు. ఈ పరిణామాల్లో రాష్ట్రానికి కొత్త అధ్యక్షుడి నియామకం జరగడంతో పార్టీ పునర్నిర్మాణంపై నాయకత్వం ఇకనైనా దృష్టి సారించొచ్చని పార్టీ శ్రేణుల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది.

అనుబంధ సంఘాల మార్పు?

అధ్యక్షుడి మార్పుతో బీజేపీ అనుబంధ సంఘాలను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసే అవకాశం ఉందని పార్టీకి చెందిన రాష్ట్ర స్థాయి నేత ఒకరు వెల్లడించారు. ముఖ్యంగా పార్టీకి మూల స్తంభాలుగా పరిగణిస్తున్న బీసీ, దళిత సంఘాలకు కొత్త నాయకత్వాన్ని నియమించే అవకాశం ఉందంటున్నారు. అలాగే కిసాన్ మోర్చా నాయకత్వాన్ని కూడా మార్చొచ్చని భావిస్తున్నారు. తద్వారా పార్టీని బూత్ లెవల్ నుంచి జిల్లా స్థాయి వరకు పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి రాబోయే రెండు, మూడు నెలల్లో నియోజవర్గాల పర్యటనలు ప్రారంభించే అవకాశం ఉందని చెబుతున్నారు.

మహిళలకు ప్రాధాన్యం

- సామాజికంగా, రాజకీయంగా రాణించాలన్నదే లక్ష్యం
- సాధికారత సాధించే దిశగా విశేష కృషి
- అట్టడుగు వర్గాలు ఎదగాలన్నదే రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి ధ్యేయం
- ములుగు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి ధనసరి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, రాజకీయ రంగాల్లో అత్యంత ప్రాధాన్యమిస్తోందని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా సర్కారు విశేష కృషి చేస్తోందన్నారు. ములుగు మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో బుధవారం జరిగింది. మంత్రి సీతక్క సమక్షంలో చైర్‌పర్సన్ రేగ కల్యాణి, వైస్ చైర్మన్ సారంగంతోపాటు పది మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలు సామాజికంగా, రాజకీయంగా రాణించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అట్టడుగు వర్గాలు సైతం ఎదగాలన్నదే రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిల ధ్యేయమని తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో కులగణన చేపట్టారన్నారు.

కష్టపడే వారికే మంచి గుర్తింపు

కష్టపడే వారికే మంచి గుర్తింపు ఉంటుందని, ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టే వారు సమర్థంగా పనిచేయాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కొత్తగా కొలువుదీరిన మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎలాంటి లోటుపాట్లు లేకుండా పనిచేయాలన్నారు. ప్రజా జీవితంలో ఎలాంటి కష్టం వచ్చినా తట్టుకుంటానని సీతక్క అన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిత్యం పాటుపడతాని చెప్పారు.

ప్రమాణ స్వీకారం చేసింది వీరే..

ములుగు మార్కెట్ కమిటీ పాలకవర్గం 12 మందితో కొలువుదీరింది. చైర్‌పర్సన్‌గా రేగ కల్యాణి, వైస్ చైర్మన్‌గా సేద సారంగం, డైరెక్టర్లుగా రాసపుత్ సీతారాం, కొమురం బాలయ్య, లక్కె వెంకన్న, ముక్తి రామస్వామి, చెరప పగడయ్య, పోరిక ప్రేమలీల, పాలకుర్తి సమ్మయ్య, అర్రం వెంకన్న, అలోత్ దేవ్‌సింగ్, పెద్ది రాజ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. వీరితోపాటు గోవిందరావు పీఏసీఎస్ చైర్మన్, ములుగు జిల్లా మార్కెటింగ్ అధికారి, అగికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్లు కూడా మెంబర్లుగా కొనసాగనున్నారు.

ప్రమాణ స్వీకారోత్సవంలో కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రవిచందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్, మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి

మేడిగడ్డ బ్యారేజీకి భారీగా వరద నీరు

- ఎగువన కురుస్తున్న వర్షాలతో ఉప్పొంగుతున్న ప్రాణహిత
- వెయిన్‌గంగా నుంచి నీటి విడుదల
- బ్యారేజీకి 2.41లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. గేట్లన్నీ ఓపెన్



మేడిగడ్డ బ్యారేజీ ఎగువన గోదావరి ప్రవాహం

మహదేవపూర్ రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద నీరు పోటెత్తుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రవాహం పెరిగింది. మహారాష్ట్రలోని వెయిన్‌గంగా ప్రాజెక్టుకు భారీగా వరదనీరు చేరుతుండటంతో అక్కడ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వెయిన్‌గంగా బ్యారేజీలో నీటిని నిల్వ చేసే లెవల్ 260 మీటర్లు కాగా ప్రస్తుతం 260.20మీటర్లుగా నీటిమట్టం చేరినట్లు అధికారులు తెలిపారు. దీంతో బ్యారేజీలోని 23 గేట్లకు రెండింటిని ఎత్తి దిగువకు 3.37 లక్షల క్యూసెక్కులు నీటిని దిగువకు పంపిస్తున్నారు. దీంతో ప్రాణహిత ప్రవాహం మరింత పెరిగి ఉగ్రరూపం దాల్చనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బుధవారం మేడిగడ్డ బ్యారేజీలోకి 2.41లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 3.90 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. వెయిన్‌గంగా వరద నీరు వస్తే ప్రస్తుతం ఉన్న ఇన్‌ఫ్లో మూడింతలు పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రాణహిత ఉధృతితో గోదావరి నది కాళేశ్వరం నుంచి దిగువకు మరింత ఉగ్రరూపం దాల్చే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఈఈ తిరుపతిరావు సూచించారు.

పెరిగిన గోదావరి ప్రవాహం



కాళేశ్వరం వద్ద నిండుగా ఉన్న గోదావరి

మహదేవపూర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): భూపాల పల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వర త్రివే ణీ సంగమం వద్ద గోదావ రి వరద బుధవారం పెరి గింది. ఎగువున వర్షాలు కువరడంతో ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోం ది. ఈ క్రమంలో వరద నీరు పెద్ద ఎత్తున త్రివేణి సంగమ గోదావరి వద్దకు చే రుతోంది. బుధవారం గోదావరి 7.20 మీటర్లకు పెరిగింది. వరద పెరగడంతో మెట్ల వద్ద భక్తులకు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. శుక్రవారం వరకు గోదావరి ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

నినదించిన కార్మిక లోకం



ములుగు కలెక్టర్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

- భూపాలపల్లి జిల్లాలో సమ్మె మిశ్రమ ప్రభావం, ములుగు జిల్లాలో పాక్షికం
- సింగరేణి గనుల వద్ద సక్సెస్
- రెండు జిల్లాల్లో యథావిధిగా నడిచిన ఆర్టీసీ బస్సులు
- కొనసాగిన వ్యాపార, వాణిజ్య సముదాయాలు
- మండల కేంద్రాల్లో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు

వివరాలు 8వ పేజీలో...

సార్వత్రిక సమ్మె సందర్భంగా కార్మిక లోకం నరసనలతో హోరెత్తించింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గళమెత్తింది. భూపాలపల్లిలో సమ్మె ప్రభావం మిశ్రమంగా కనిపించింది. సింగరేణి కార్మికులు మొదటి షిఫ్టు నుంచే విధులను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించారు. ఈ జిల్లాలో ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకులు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. వాణిజ్య, వ్యాపార సముదాయాలు కొనసాగాయి. ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. ములుగు జిల్లాలో సార్వత్రిక సమ్మె ప్రభావం పాక్షికంగా కనిపించింది. వ్యాపార, వాణిజ్య సముదాయాలు విద్యా సంస్థలు యథావిధిగా కొనసాగాయి. ఆర్టీసీలో ఎలాంటి ప్రభావం కనిపించలేదు. సమ్మె సందర్భంగా ఆయా మండలాల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, స్కావెంజర్లు నిరసనలు తెలిపారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు విధులకు గైర్హాజరయ్యారు. పలు చోట్ల అసంఘటిత కార్మికులు రోజువారీ పనులకు వెళ్లలేదు. ములుగు కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు, కార్మికులు నిరసన తెలిపారు.

- ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్




భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెరుచుకోని స్టేట్ బ్యాంకు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి ప్రభుత్వానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్‌లో రూ. 16 లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు మెరుగైన ఆరోగ్యం అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సీఎం లక్ష్యానికి అనుగుణంగా ఆరోగ్య కేంద్రాల్లో సేవలందించాలని సూచించారు. ఆర్టికల్ 275(1) నిధులు రూ.14 లక్షలతో ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నిర్మించిన బర్త్ వెయిటింగ్ గదిని అనంతరం ప్రారంభించారు. మండలంలోని పంబాపూర్‌లో భీమ్ ఘన్‌పూర్ చెరువునీటిని దిగువన ఉన్న పంట పొలాలకు నీటి పారుదల శాఖ ఈఈ ప్రసాద్, ఇతర అధికారులు, కాంగ్రెస్ నేతలతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, అంబాల శ్రీనివాస్, వెంకన్న, బుర్ర కొమరయ్య, శరత్ పటేల్ తదితరుల పాల్గొన్నారు.



భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్‌లో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు



గణపురంలో జెండా ఎగురవేస్తున్న ఏబీవీపీ నాయకులు

గణపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ వేడుకలు మండల కేంద్రంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంధం నాగరాజు, కళాశాలల విభాగం రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్ ముఖ్య అతితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా విద్యారంగంలో అనేక సమస్యలపై విద్యార్థుల పక్షాన ఏబీవీపీ అనేక పోరాటాలు చేస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమంలో సైతం తమ గళం వినిపించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సోమనాథ్, సారంగపాణి, టప్ప ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గట్టెక్కని కష్టాలు



ఏజెన్సీ వాసులను రవాణా కష్టాలు వెంటాడుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఏటూరునాగారం మండలంలోని దొడ్ల-మల్యాల గ్రామాల మధ్య జంపన్నవాగుకు వరద తాకిడి పెరిగింది. దీంతో మల్యాల, కొండాయి, గోవిందరాజుల కాలనీ, ఐలాపురం గ్రామాలకు రవాణా కష్టాలు మొదలయ్యాయి. జంపన్నవాగుపై తాత్కాలిక రోడ్డు నిర్మాణం చేపట్టిన కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా దురదమయంగా మారింది. ఆ తాత్కాలిక రోడ్డు వాహనాల రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. బుధవారం ఈ రహదారిపై వెళ్తున్న ఓ ఆటో బురదలో కూరుకుపోయింది. దీంతో దాన్ని ప్రయాణికులు ఇలా నెట్టుకుంటూ బయటకు తీయాల్సి వచ్చింది. జంపన్నవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు రెండేళ్లుగా ముందుకు సాగకపోవడంతో ఈసారి కూడా వాన కాలమంతా ఆయా గ్రామాలు జలదిగ్బంధంలోనే కొనసాగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

- ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు ఆస్పత్రిలో వ్యక్తి మృతి

వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందాడని బంధువుల ఆందోళన

తొర్రూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వైద్యుడి నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి చెందాడని మృతుడి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టిన సంఘటన బుధవారం తొర్రూరులో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన పొన్నం పాండురంగ (75) కడుపు నొప్పి వస్తుందని తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రాగా, వారు సంబంధిత ఇంజక్షన్‌లు ఇచ్చి, స్కానింగ్ చేయించుకుని రావాలని తెలపగా, స్కానింగ్ సెంటర్‌కు వెళ్లేలోపే పాండు రంగ మృతి చెందాడు. ఆస్పత్రి వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్‌ల వల్లే మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వైద్యులతో మాట్లాడతామని బంధువులను సముదాయించి అక్కడి నుంచి వారిని పంపించారు.



పాండురంగ (ఫైల్)

ఇన్సులేటర్, కాసర్‌పై వాలిన పిచుకలు మృతి

● అరగంట పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) :మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హోలీ ఏంజెల్స్ సమీపంలో మధ్యాహ్నం విద్యుత్ స్తంభంపై ఉన్న ఇన్సులేటర్, కాసర్‌పై వాలిన పిచుకలు ఎర్త్ కావడంతో మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. లైన్‌మెన్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు పిచుకలు ఎగురుకుంటూ వచ్చి విద్యుత్ స్తంభంపై ఉన్నఇన్సులేటర్, కాసర్ వాలాయి. ఒక్కసారిగా వాటికి విద్యుత్ ఎర్త్ కావడంతో అక్కడికక్కడే మృతిచెంది తీగలపైనే ఉండడంతో విద్యుత్ సరఫరా ట్రిప్ కావడంతో సుమారు 30 నిమిషాల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు చెప్పారు. విషయంతెలుసుకున్న విద్యుత్ సిబ్బంది అక్కడికిచేరుకుని పిచుకలను విద్యుత్ వైర్ల నుంచి తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

జిల్లా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెంకటయ్య

మహబూబాబాద్ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా పోక్సోకోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అనంతారం గ్రామానికి చెందిన న్యాయవాది కొంపెల్లి వెంకటయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, డీసీసీ అధ్యక్షులు భరత్‌చందర్‌రెడ్డిలకు వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలు పెరిగాయని, బాధితులకు అండగా ఉండి నిందితులకు శిక్ష పడేలా కృషి చేస్తానని వెంకటయ్య చెప్పారు.



పిట్టలోనిగూడెం హత్య కేసులో నిందితుల అరెస్ట్

14 రోజుల రిమాండ్ విధించిన న్యాయమూర్తి

లింగాలఘణపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం ఏనెబావి శివారు పిట్టలోనిగూడెంలో ఈనెల 7న అర్ధరాత్రి కాల్య కనకయ్య హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో నలుగురు నిందితులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హత్యోదంతంపై మృతుడి చిన్నమ్మ కాల్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో నిందితులు మృతుడి ఇద్దరు భార్యలు శిరీష అలియాస్ చొక్కమ్మ, మరో భార్యతో పాటు హత్యకు సహకరించిన గుజురోత్ జనార్దన్, గుజురోత్ శ్రీనివాస్‌కు జనగామ న్యాయమూర్తి శశి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ తీర్థయాత్రలు

- ప్రత్యేక ప్యాకేజీలతో పలు పుణ్యక్షేత్రాలకు సేవలు
- భక్తులకు చేరవయ్యేందుకు వినూత్న కార్యక్రమం
- 11న ఏడు దేవాలయాల సందర్శనకు అవకాశం

కృష్ణకాలనీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) మరింత ముందుకు దూసుకెళ్తోంది. ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చడానికి పరిమితం కాకుండా ఎన్నడూ లేని విధంగా వినూత్న సర్వీసులకు శ్రీకారం చుట్టింది. ఆధ్యాత్మిక ప్రదేశాలకూ తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. భూపాలపల్లి డిపో నుంచి వివిధ ప్రాంతాల్లోని ఏడు దేవాలయాలను సందర్శించుకునే అవకాశాన్ని ఆర్టీసీ యాజమాన్యం కల్పించింది. ఇందులో కాణిపాకంలోని విఘ్నగణపతి దేవాలయం, వేలూరులోని స్వర్ణదేవాలయం (గోల్డెన్ టెంపుల్), అరుణాచలంలోని అరుణాచలం ఆలయం, అలంపూరి జోగులాంబలోని జోగులాంబ శక్తిపీఠం, స్వర్ణగిరిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, యాదగిరిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, సురేంద్రపురిలోని దేవాలయాల సందర్శనకు తమ సేవలను ఆర్టీసీ విస్తరించింది.

11న పుణ్యక్షేత్రాలకు ప్రయాణం

భూపాలపల్లి ఆర్టీసీ డిపో నుంచి దైవ దర్శనాల నిమిత్తం సూపర్ లగ్జరీ బస్సును సిద్ధం చేశారు. ఈనెల 11న ప్రయాణానికి సిద్ధమైన వారంతా దర్శనాలకు తరలివెళ్లనున్నారు. ఇందుకు ఒక్కొక్కరికి రూ.5,300 చార్జీ నిర్ణయించారు. మొత్తంగా ఏడు దేవాలయాలు కలిపి 2100 కిలో మీటర్లు ఈ ప్రయాణం సాగనుంది. తిరిగి వచ్చే వరకు టీలు, టిఫిన్లు, భోజన సౌకర్యాల్ని కూడా ఇదే ప్యాకేజీలో అందిస్తున్నారు. ఈ బస్సులో 32 మందికి కెపాసిటీ కల్పించగా ఇప్పటి వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 20 మంది బుకింగ్ చేసుకున్నారు.



భూపాలపల్లి ఆర్టీసీ డిపో

అధికారుల అలసత్వం

ఆర్టీసీ సంస్థ గతంలో తమ ప్రయాణికులను పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం గతానికి భిన్నంగా ఎన్నడూలేని విధంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకరావడంతో పాటు ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు ఈ సంస్థ శ్రీకారం చుట్టింది. నిత్యం వివిధ పనులతో బిజీగా ఉండే వారికి, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించే స్తోమత లేని వారికి ఉపయోగకరంగా ఆర్టీసీ చేసిన వినూత్న ఆలోచన మంచిదే. అయితే.. ప్రయాణికులకు దీనిపై అవగాహన కల్పించడంలో ఆ సంస్థ అధికారులు అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇంతటి వినూత్న కార్యక్రమంపై ప్రచారం చేయకపోవడమేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

రూ. 5,381.87 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక

జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



వార్షిక రుణ ప్రణాళిక బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

జనగామ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా వార్షిక రుణ ప్రణాళికను రూ. 5381.87 కోట్లతో కేటాయించినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా వెల్లడించారు. కలెక్టరేట్ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లు, బ్యాంకు కంట్రోలర్లతో బ్యాంకు రుణాల వివరాలు, బ్యాంకు లింకేజీ ప్రభుత్వ పథకాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. మహిళా స్వయం సంఘాలకు రుణాలను అధిక మొత్తంలో అందించాలని, మత్స్యకారుల సహకార సంఘాలకు రుణాలను పెంచాలన్నారు. పశు పెంపకం, చేనేత రంగాలకు కూడా రుణాలను మంజూరు చేయాలన్నారు. వార్షిక ప్రణాళిక 2025-26కు సంబంధించి రూ. 5,381.87 కోట్లు కేటాయించగా ప్రాధాన్య రంగానికి రూ. 4,535.72 కోట్లు, మిగతా రంగాలకు రూ. 846 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ వార్షిక రుణ ప్రణాళికలను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, డీఆర్డీవో వసంత, ఎల్‌డీఎం మూర్తి, ఆర్‌బీఐ ఏజీఎం చేతన్, డీఏవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పగూడెం హైస్కూల్‌లో విద్యార్థులకు బోధన

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా బుధవారం సందర్శించారు. ఆరో తరగతి విద్యార్థులకు కాసేపు ఇంగ్లిష్ పాఠ్య పుస్తకం తీసుకొని బోధించారు. విద్యార్థులతో పాఠం చదివించారు. విద్యార్థుల ఇంగ్లిషు పదాల ఉచ్చారణను సరి చేశారు. పదో తరగతి వెళ్లేలోగా అన్ని సబ్జెక్టుల్లో మెరుగు కావాలని సూచించారు. మ్యాథ్స్ కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, ఎంపీవో నర్సింగరావు, హెచ్‌ఎం రఘుజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఉద్యోగులకు బెనిఫిట్స్ అందజేయాలి

తొర్రూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం వెంటనే వారికి రావాల్సిన బకాయిలు, ఇతర బిల్లులను అందించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రమేష్ అన్నారు. బుధవారం తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ వయసు పెంచి ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించకపోవడం సరి కాదన్నారు. వారికి రావాల్సిన గ్రాట్యూటీ, జీపీఎఫ్ ఫైనల్ పేమెంట్ లను వెంటనే చెల్లించకపోవడంతో ఉద్యోగ విరమణ పొందిన వారు మనోవేదనకు గురవుతున్నారని, మరి కొందరు మానసిక వేదన తట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులతో గుండెపోటుతో మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగ విరమణ పొందిన వారికి పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరం ఉపేందర్ రెడ్డి, కొండం జనార్దన్, కొలుపుల శ్రీను, సబియా బాను, సంపత్, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

జిల్లాకు 8 సబ్‌స్టేషన్లు మంజూరు

● జిల్లా విద్యుత్‌శాఖ అధికారి విజేందర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా సర్కిల్ పరిధిలో 8 విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరైనట్లు జిల్లా విద్యుత్‌శాఖ అధికారి పి.విజేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా అవసరమున్నచోట కొత్త సబ్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వాటి పనులు సైతం వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఎటువంటి లోవోల్టేజ్ సమస్య ఉండదని పేర్కొన్నారు. సమర్థవంతంగా విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మౌళిక వసతుల అభివృద్ధికి అనుగుణంగా కొత్త సబ్‌స్టేషన్‌ల రాకతో రైతులకు, గృహ వినియోగదారులకు అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయవచ్చన్నారు. దీంతో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లపై లోడు భారం తగ్గుతుందని పేర్కొన్నారు. సాగు, గృహ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించనున్నట్లు తెలిపారు. ఇందులో ఎస్‌సీఏడీల అనుసంధానంతో ఆధునిక, సాంకేతికతను అమలు చేయడం జరుగుతుందన్నారు.

చెరువు కట్ట మరమ్మతులు నిలిపివేయడం సరికాదు

వెల్లికట్టె గ్రామ రైతుల ఆందోళన

తొర్రూరు రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లికట్టె గ్రామ పెద్దచెరువు మరమ్మతు పనులు నిలిపివేయడం సరికాదని గ్రామస్థులు, రైతులు కొమ్ము సోమన్న, ఎల్లయ్య, యాకయ్య, మల్లేష్ ఆరోపించారు. వెల్లికట్టె గ్రామ పెద్దచెరువు కట్టపై జరుగుతున్న పనులు అర్థాంతరంగా నిలిపివేయడంపై బుధవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత సంవత్సరం కురిసిన వర్షాలతో చెరువు కట్ట పూర్తిగా ధ్వంసమైందన్నారు. తాత్కాలికంగా ఇసుక నింపి అడ్డుకట్టవేశామన్నారు. ప్రమాదకరంగా ఉన్న చెరువు కట్టకు మరమ్మతులు చేయడానికి రూ.6లక్షల95వేల నిధులు మంజూరీ కావడంతో పనులు చేపట్టారన్నారు. దీంతో పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ను పనులు నిలిపివేయాలని అధికారులు ఆదేశించడంతో నిలిపివేసినట్లు పేర్కొన్నారు. స్థానిక అధికార పార్టీ నాయకుడు ఫోన్‌చేసి చెప్పడంతో, అధికారులు కమిషన్ల కోసం పనులు నిలిపివేశారని రైతులు ఆరోపించారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో చెరువు కట్ట పనులు త్వరితగతిన పనులు చేయించాల్సిన అధికారులు నిలిపి వేయించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయం పై ఇరిగేషన్ డీఈ శ్యాంసుందర్‌ను వివరణ కోరగా పొంతనలేని సమాధానం చెబుతూ అగ్రిమెంట్ కాపీ డేటా చూడాలని ఫోన్‌కట్ చేశారు. అదేవిధంగా ఏఈ సాయికిరణ్‌ను సంప్రదించగా రెండు రోజుల తరువాత పనులు ప్రారంభించడం కోసం అంటూ ఫోన్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కొమ్ము యాకయ్య, వెంకన్న, సాయిలు, సోమయ్య, ప్రభాకర్, సతీష్, మహేందర్, వెంకన్న, సోమేష్, బాబు, కమలాకర్, రాంబాబు, కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



వెల్లికట్టె చెరువుకట్టపై ఆందోళన చేస్తున్న రైతులు

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రైమరీ స్కూల్ నుంచే విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ, దిశా ఫౌండేషన్, ఈఎల్ఎఫ్ ఇంగ్లిష్ సౌజన్యంతో బుధవారం రెండో దశలో జిల్లాలోని 50 ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన లర్న్ టు రీడ్ 90రోజుల విద్యా కార్యక్రమాన్ని కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడడం, ఆ భాష నైపుణ్యాల సాధన కోసం ములుగు జిల్లాలో విద్యాశాఖ, దిశా ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అర్షం రాజు, సెక్టోరల్ అధికారులు రమాదేవి,గుళ్లపల్లి సాంబయ్య, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఐశ్వర్య, మంజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న మంత్రి సీతక్క

ఇద్దరు బాల కార్మికులకు విముక్తి


కాటారం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా బాల కార్మికులను గుర్తించే కార్యక్రమాన్ని జిల్లా సహాయ కార్మిక అధికారి వినోద, ఎస్సై ఓం పాల్ నేతృత్వంలో సిబ్బంది మండలంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. అంకుసాపూర్‌లో రైస్ మిల్లులో ఆపరేటర్‌కు సహాయకుడిగా పనిచేస్తున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన 17ఏళ్ల బాలుడిని గుర్తించారు. గంగారం క్రాస్ రోడ్డు వద్ద టైల్స్ పని చేస్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన 15ఏళ్ల బాలుడిని గుర్తించినట్లు ఏఎల్‌వో వినోద తెలిపారు.

బాల కార్మికులను పనిలోకి తెచ్చిన టేకేదారులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త లింగారావు తదితరులు పాల్గొన్నారు.

గురు పౌర్ణమికి ముస్తాబైన మందిరం

మరిపెడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమి కోసం మరిపెడలోని సాయిమందిరం ఆ ఆలయ నిర్వాహకులు ముస్తాబు చేశారు. గురువారం గురు పౌర్ణమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకలు కాకడ హారతితో ప్రారంభిస్తామని ఆ ఆలయ పూజారి రవీంద్రాచారి తెలిపారు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మరిపెడ సాయి భక్తుల కోసం నిర్మించిన మినీ ఏసీ ఫంక్షన్‌హాల్‌ను సైతం ఆలయ వ్యవస్థాపకులు ప్రారంభిస్తారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న ఏఎన్ఎంలు

తొర్రూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్‌హెచ్ఎంలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరుతూ బుధవారం తొర్రూరులోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నల్ల బ్యాడ్జీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో 510 జీవో ద్వారా నష్టపోయిన ఎన్‌హెచ్ఎం కేటగిరీలో పనిచేసే ఉద్యోగులందరికీ బేసిక్‌పే అమలు చేయాలని, ఉద్యోగ విరమణ పొందిన వారికి పది లక్షల బెన్‌ఫిట్ అందించాలన్నారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి ప్రతి నెల వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. లేనిచో విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. మున్నీ, గీత, శారద, శోభ, శ్రీలత, అనురాధ, సునీత, జ్యోత్స్న పాల్గొన్నారు.



వాజేడు చెరుకూరులో రైతులకు చెక్కులను అందజేస్తున్న ఏఈవో రాధిక

మొక్కజొన్న రైతులకు పరిహారం పంపిణీ

వెంకటాపురం/వాజేడు జూలై 9 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలతో నష్టపోయిన ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు మండలాల రైతులకు బుధవారం పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. వెంకటాపురం మండలంలోని పాత్రాపురం, ఆలుబాక రైతు వేదికల్లో జరిగిన కార్యక్రమాల్లో మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రీకన్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. వాజేడు మండలంలోని చెరుకూరు, పేరూరు, వాజేడు రైతువేదిక ల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 170 మంది రైతులకు చెక్కులను ఏఈవో రాధిక, హరీశ్, జాఫర్ అందజేశారు. ఇటీవల మంత్రులు తుమ్మల, సీతక్క చేతుల మీదుగా కొంత మందికి చెక్కులను అందజేయగా మిగిలిన వారికి బుధవారం పంపణీ చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీఎన్జీవోస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పాలకులు పరిష్కరించాలని టీఎన్జీవోస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ బూరుగు రవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన టీఎన్జీవోస్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రధానంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ అమలు పర్చాలన్నారు. ఈహెచ్ఎస్ పథకం అమలు, బ్యాడ్ క్లైమేట్ అలవెన్స్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దశరథ రామరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షఫీ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి జ్ఞానేశ్వర్ సింగ్, సహాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వంశీకృష్ణ, వేణు, మురళీధర్‌రెడ్డి, జమాల్, భార్గవ్, మాళవిక, విజయరమణ కుమార్, పరమేశ్వర్, సబిత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడిన యోధుడు భిక్షపతి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నాగయ్య

మరిపెడ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నమ్మిన సిద్ధాంతం కోసం కడ వరకు పోరాడిన యోధుడు లింగపల్లి భిక్షపతి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లంపేటలో ఓ ఫంక్షన్ హాలులో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. కరుడుగట్టిన భూస్వాములున్న ఈ ప్రాంతంలో కూలీ, భూమి కోసం పోరాటాలు నిర్వహిస్తూ, అనేక దాడులు, నిర్బంధాలను ఎదుర్కొన్నాడని కొనియాడారు. భిక్షపతి చనిపోయిన తర్వాత కూడా తన పార్థివ దేహాన్ని మానుకోట మెడికల్ కళాశాలకు ఇవ్వడం తర్వాత తరాలవారికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. భిక్షపతి మృతి సీపీఎంకి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, సూర్ణపు సోమయ్య, గుండగాని మధుసూదన్, బాణాల రాజన్న, జిన్నా లచ్చయ్య, కందాల రమేశ్, రాజశేఖర్, ఉప్పలయ్య, మమత, దుండి వీరన్న, కొయ్యాడ రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎల్లంపేటలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నాగయ్య

నేడే గురు పౌర్ణమి

- ఊరూరా గురుపూజోత్సవం
- 24 గంటల పాటు సాయిబాబా ఏకనామ పారాయణం



వరంగల్ కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజును వ్యాస(గురు) పౌర్ణమిగా పిలుస్తారు. ఈ రోజున శిష్యులు గురు పాదుకా పూజలు చేస్తారు. వ్యాస పౌర్ణమి సందర్భంగా వేదవ్యాసుడి ఆరాధనతోపాటు శ్రీషిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలతో అభిషేకాలు నిర్వహిస్తారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని సాయిబాబా దేవాలయాల్లో, దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో, గురు మందిరాల్లో, అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానాలు ఏర్పాటు చేశారు. 'ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి' అనే నామాన్ని 24 గంటల పాటు ఏకనామంతో భజన మండళ్లలో పారాయణాలు నిర్వహిస్తారు.

సాయిబాబా ఆలయాల్లో ఏర్పాట్లు..

గురు పౌర్ణమి సందర్భంగా నగరంలోని ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. భద్రకాళి దేవాలయం వద్ద గల సాయిబాబా దేవాలయం, దేశాయిపేట, మండిబజార్, ఓసిటీలోని సాయిబాబా దేవాలయాల్లో హారతులు, భజన, అన్నదానం, పల్లకీ సేవకు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా శ్రీదుర్గేశ్వరాలయం వీధిలో గల సేవాశ్రమంలో శ్రీషిర్డీ సాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నాగబండి కేదారీశ్వర్, గుజ్జారి రమేష్‌బాబు, రాయబారపు రవికుమార్ తెలిపారు.

శ్రీకృష్ణ కాలనీలోని సాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో 24 గంటల పాటు ఓం సాయి, శ్రీసాయి, జయజయ సాయి ఏకనామం, సాయిబాబా పల్లకీ ఉత్సవం, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహా అన్నదానం నిర్వహిస్తామని వెంకటరమణ తెలిపారు. సాయి సేవాదళ్ ఆధ్వర్యంలో ఎల్లంబజార్‌లోని సాయిబాబా ఆలయంతో పాటు ఖిలా వరంగల్ సమీపంలోని షిర్డీ సాయిబాబా దేవాలయం, గీసుగొండ మండలం వంచనగిరి కోటగండి ప్రాంతంలో గల సాయిబాబా దేవాలయం, మామునూరులోని సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నారు.

వేడుకలకు వేళాయే..

- భద్రకాళి ఆలయంలో నేడు శాకంబరీ ఉత్సవాలు
- 10వేల కిలోల కూరగాయలు, పండ్లతో అమ్మవారికి అలంకరణ
- భక్తులకు ఆరు క్వింటాళ్ల ప్రసాదం వితరణ
- ప్రత్యేక క్యూలైన్లు... విస్తృత బందోబస్తు
- ఉదయం 9 గంటల నుంచే సర్వ దర్శనం



శాకంబరీ వేడుకల దర్శనానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లు



వరంగల్ కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : భక్తకోటి ఆరాధ్య దేవత భద్రకాళి అమ్మవారి శాకంబరీ అలంకరణ వేడుకకు సర్వం సిద్ధమైంది. గురువారం ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా భద్రకాళి అమ్మవారిని సుమారు 15 క్వింటాళ్ల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో శాకంబరీ దేవీగా అలంకరించి భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జామున 3 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు 12 మంది అర్చక బృందంతో అమ్మవారిని అలంకరించి ఉదయం 9 గంటల నుంచి భక్తుల సర్వదర్శనానికి అనుమతిస్తారు. యేటా ఆషాఢ మాసంలో అమావాస్య నుంచి పౌర్ణమి వరకు నిర్వహించే ఉత్సవాల చివరి రోజు అమ్మవారిని వివిధ శాకాలతో అలంకరిస్తారు. అందులో భాగంగా ఈసారి 10 టన్నుల 10 వేల కిలోల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు.

కూరగాయలు ఇవే..

పసుపు 9 కిలోలు, కుంకుమ 9 కిలోలు, 600 కంకులు, 300 కిలోల దోసకాయలు, 50 కిలోల బుడిమకాయలు, 300 కిలోల బెండకాయలు, 100 కిలోల దొండకాయలు, 200 కిలోల వంకాయలు, 200 కిలోల కాకరకాయలు, 100 కిలోల గోరుచిక్కుడుకాయలు, 100 కిలోల దేశీ చిక్కుడుకాయలు, 80 కిలోల బీట్‌రూట్, 150 కిలోల క్యారెట్, 70 కిలోల పుల్లగంద, 60 కిలోల కందగడ్డ, 500 సొరకాయలు, వెయ్యి పొట్లకాయలు, 25 కిలోల బోడ కాకరకాయలు, 100 కిలోల ఆలుగడ్డ, 60 కిలోల శామగడ్డ, 120 కిలోల క్యాప్సికం, 60 కిలోల బీరకాయ, 100 కిలోల క్యాబేజీ, 120 కిలోల క్యాలీఫ్లవర్, 100 గుమ్మడికాయలు, 100 బూడిది గుమ్మడికాయలు, 5 కట్టల మునిగెకాయలు, 50 కిలోల కీర దోసకాయ, 30 కిలోల మామిడికాయలు, 50 కట్టల ముల్లంగి, 50 వెలగపండ్లు, 25 బతానీకాయలు, 30 కిలోల చోచో, 50 కిలోల దిల్ పసంద్, 2 గెలల అరటి కాయలు, 20 కొబ్బరి బోండాలు, 20 కిలోల టమాటలు, 50 కిలోల బిన్నీస్ కాయలు, 30 కిలోల బొబ్బరి కాయలు, 11 రకాల ఆకు కూరలు 11 కిలోల చొప్పున.

పండ్లు ఇవే...

సేపులు 300, దానిమ్మకాయలు 100, సంత్రాలు 100, బతాయిలు 100, అరటిపండ్లు 100, మామిడి పండ్లు 100, నాలుగు కిలోల చర్రీస్, 11 కిలోల నల్ల ద్రాక్ష, 11 కిలోల తెల్ల ద్రాక్ష, పైన్ ఆపిల్ 100, ఖర్బూజ 50, పుచ్చకాయలు 50, త్రోటిఫ్రూట్ 4 కిలోలు, డ్రాగెన్ ఫ్రూట్స్ 20, సపోటాలు 2 కిలోలు, స్ట్రాబేర్రి 10 బాక్స్‌లు, కివీ ఫ్రూట్స్ 50 పీసులు, జమకాయలు 100, కరంకాయలు 10 కిలోలు, చెరుకు గడలు 2.



ఉత్సవాలకు విద్యుత్ కాంతుల కోసం సిద్ధం చేసిన లైట్లు, సామగ్రి



కార్పొరేషన్ రోడ్డులో వాహనాల పార్కింగ్‌కు చేస్తున్న ఏర్పాట్లు

వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

భద్రకాళి ఆలయంలో అమ్మవారి శాకంబరీ ఉత్సవాలకు 50వేల మందికి పైగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వారితో పాటు 150 మంది ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సేవా సమితి వలంటీర్లు విధులు నిర్వహించనున్నారు. భక్తులకు ఈసారి ఐదు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ధర్మ దర్శనానికి ఒకలైన్, రెండోది రూ.50తో కూడిన శీఘ్ర దర్శనం, మూడోది రూ.100తో కూడిన అతి శీఘ్ర దర్శనం, నాలుగోది వీఐపీలు, డోనర్స్ ఐదోది వీవీఐపీలకు దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు దేవాలయం ముందు ఖాళీ స్థలంతో పాటు పాలిటెక్నిక్ గ్రౌండ్, మున్సిపాలిటీ కార్పొరేషన్ గ్రౌండ్, కాపువాడకు వెళ్లే దారిలో ఖాళీ స్థలంలో ఏర్పాట్లు చేశారు. ఒక వేళ వర్షం వచ్చినా ఇబ్బందులు ఎదురు కాకుండా వాటర్ ప్రూఫ్‌తో కూడిన పందాలను ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇవే కాకుండా అంబులెన్స్, వైద్య శిబిరం, ఫైర్ ఇంజన్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించడానికి మొదటి సారిగా 12 వాకీటాకీలను ఆలయ సిబ్బందికి అందజేస్తున్నారు. భక్తులకు ప్రసాదాలను విక్రయించడానికి మూడు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేస్తున్నారు. గురువారం రోజున 20వేల లడ్డూలు, 20వేల పులిహోర ప్యాకెట్లు, 10వేల రవ్వకేసరి ప్రసాదాలు సిద్ధం చేస్తున్నారు. అలాగే భక్తులకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు 8 రకాలతో కూడిన 600 కిలోల ప్రసాదాన్ని పంపిణీ చేస్తారు. అందులో రాంకో సిమెంట్ వారి ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ, బాదంపాలు పంపిణీ చేస్తారు.

భారత్ బంద్ ప్రశాంతం, సంపూర్ణం

- సంఘటితంగా కదిలిన కార్మిక లోకం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, ప్రదర్శనలు
- కార్మిక వ్యతిరేక చట్టాలపై నిరసన
- రద్దు చేయాలని ముక్తకంఠంతో డిమాండ్



వరంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక, జర్నలిస్ట్ సంఘం నాయకులు

హనుమకొండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కార్మిక వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ పదికిపైగా కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సార్వత్రిక సమ్మె భారత్ బంద్ గురువారం విజయవంతంగా జరిగింది. కార్మికులు తమ హక్కుల కోసం నినదించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల నినాదాలతో జిల్లా, మండల కేంద్రాలు పిక్కటిల్లాయి. అన్ని సేవలు నిలిచిపోయి సాధారణ పౌరజీవనం స్తంభించిపోయింది. సమ్మె సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షన్నర మందికి పైగా సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బంద్‌లో పాల్గొన్నారు. బ్యాంకులు, ఎల్‌ఐసీ, బీఎస్ఎన్ఎల్ తదితర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు బంద్‌లో భాగస్వాములు అయ్యారు. తమ కార్యాలయాల ముందు నిరసన ప్రదర్శనలు జరిపారు. ర్యాలీలలో పాల్గొన్నారు. పదికిపైగా కార్మిక సంఘాలు భారత్ బంద్‌కు పిలుపు నిచ్చాయి. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్(సీఐటీయూ), ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఐఎన్‌టీయూసీ) భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ), ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్(ఏఐటీయూసీ), తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(టీఎన్‌టీయూసీ), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్(ఐఎఫ్‌టీయూ)లతో పాటు హెచ్ఎంఎస్, టీయూసీఐ, ఏఐయూటీయూసీ ఈ బంద్‌లో పాల్గొనను న్నాయి. అధికారిక, అనధికారిక, అసంఘటిత ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలకు చెందిన యూనియన్లు బంద్‌లో పాల్గొన్నాయి.

సేవలకు అంతరాయం



జనగామ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘ నాయకులు, కార్మికులు

భారత్ బంద్ సందర్భంగా బ్యాంకులు పని చేయలేదు. ఎల్‌ఐసీ, ఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులు విధులను బహిష్కరించారు. దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. పెట్రోల్ బంక్‌లు ఉదయం బంద్ పాటించాయి. ఆటోలు నడవలేదు. మధ్యాహ్నం వరకు దుకాణాలన్నీ బంద్ కావడంతో రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, వస్త్ర దుకాణాల కార్మికులు బంద్‌లో పాల్గొనడంతో అవి కూడా మూతపడ్డాయి. పారిశుధ్య కార్మికులు కూడా బంద్‌లో పాల్గొన్నారు. విధుల్లో చేరలేదు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సైతం విధులకు దూరంగా ఉన్నారు.



సమ్మెతో భూపాలపల్లి ఓసీ-2లో నిలిచిన వోల్వో వాహనాలు

ర్యాలీలు, ప్రదర్శనలు



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో సార్వత్రిక సమ్మె ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సార్వత్రిక సమ్మెలో భాగంగా హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రాల్లో, మండలాల్లో సైతం పెద్ద ఎత్తున ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు జరిగాయి. కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని తమ హక్కుల కోసం నినదించారు. కార్మిక వ్యతిరేక చట్టాలపై నిరసన ప్రకటించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ఏకశిల పార్కు నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున మహా ప్రదర్శన జరిగింది. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కూర వెంకట్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కు రాజుగౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, నున్న అప్పారావు, బీఆర్‌టీయూ జిల్లా నాయకుడు నాయిని రవితో పాటు సీపీఎం, సీపీఐ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. వరంగల్ జిల్లాలో భారత్ బంద్ పూర్తిగా జరిగింది. వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అన్ని ట్రేడ్ యూనియన్ల నాయకులు ఇందులో పాల్గొన్నారు. ఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులు విధులను బహిష్కరించారు. హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయం ఎదుట కొద్దిసేపు ప్రదర్శన జరిపారు. వరంగల్ చౌరస్తాలో కొద్దిసేపు ధర్నా జరిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి మేకల రంగయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



హనుమకొండలోని తపాలా కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులు

వరంగల్ సీకేఎం ఆస్పత్రి ఎదుట ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరసన ప్రదర్శన జరిపారు. జనగామ జిల్లాలోనూ సమ్మె ప్రశాంతంగా జరిగింది. జనగామ చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. సుమారు 300 మందికిపైగా కార్మికులు ఇందులో పాల్గొన్నారు. ములుగు జిల్లాలో బంద్ పాక్షికంగా జరిగింది. కలెక్టరేట్ ముందు కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సార్వత్రిక సమ్మె సంపూర్ణంగా జరిగింది. బొగ్గు గనుల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. జెన్‌కో, సహకార సంఘాల ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. జెన్‌కో ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన జరిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో సమ్మె జరిగింది. జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కార్యాలయం నుంచి తహసీల్ సెంటర్ వరకు కార్మికులు ర్యాలీ తీశారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

ర్యాలీలు, నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కార్మిక హక్కులను హరణను నిరసించారు. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల నినాదాలతో ర్యాలీలు మారుమోగాయి. నిరసన ప్రదర్శనలు దద్దరిల్లాయి.



ములుగు జిల్లా వెంకటాపురంలో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ

సౌదీలో చిక్కుకున్న వ్యక్తిని రప్పించేందుకు మంత్రి పొన్నం చర్యలు

- మంత్రి ఆదేశాలతో రియాద్ ఎంబసీకి ప్రభుత్వం లేఖ

భీమదేవరపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి ఈశ్వర్ సౌదీలో చిక్కుకోగా, మంత్రి పొన్నం ప్రభాకర్ అతన్ని రప్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు రియాద్ ఎంబసీకి ప్రభుత్వం బుధవారం లేఖ రాసింది. తాళ్లపల్లి ఈశ్వర్ కుటుంబ పోషణ కోసం 2017లో సౌదీ అరేబియా వెళ్లి కొంతకాలం కారు డ్రైవర్‌గా పనిచేశాడు. అనంతరం విధిలేని పరిస్థితుల్లో ఖర్జూర తోటలో కూలీగా చేరాడు. ఒక సంవత్సరం తర్వాత పని లేదంటూ బయట ఫ్రీలాన్సర్‌గా పనిచేయడానికి అనుమతి ఇచ్చారు. అప్పటి నుంచి ఈశ్వర్ అదే తోటలో వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఒప్పందం ముగిసిన తర్వాత వీసా గడువు పొడగించలేదు. భారతదేశానికి తిరిగి రావడానికి సాధ్యపడలేదు. దీంతో సౌదీ అరేబియాలో చిక్కుకొని తీవ్ర ఇక్కట్లు పడుతున్న కొప్పూర్‌కు చెందిన తాళ్లపల్లి ఈశ్వర్ కుటుంబ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆశ్రయించారు. మంత్రి పొన్నం ఈశ్వర్‌ను ఇండియాకు రప్పించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. జీఏడీ అధికారులను మంత్రి ప్రభాకర్ ఆదేశించారు. ఎన్ఆర్ఐ అడ్వైజర్ కమిటీ వైస్ చైర్మన్ మంద భీమ్‌రెడ్డి ఈశ్వర్ కుటుంబ సభ్యుల వెంట ఉండి మార్గనిర్దేశనం చేశారు. మంత్రి లేఖకు వెంటనే స్పందిస్తూ ఈశ్వర్‌ను ఇండియాకు రప్పించేందుకు సౌదీ అరేబియాలోని రియాద్ ఇండియన్ ఎంబసీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ రాశారు. అలాగే భారత ప్రభుత్వ విదేశీ, ప్రవాస భారతీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కూడా ఈ విషయాన్ని రియాద్‌లోని ఇండియన్ ఎంబసీతో ఈశ్వర్‌ను పంపించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఎన్ఆర్ఎస్‌సీని సందర్శించిన విద్యార్థినులు



ఇస్రో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో విద్యార్థినులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 'బేటీ బచావో బేటీ పడావో' పథకంలో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమ, బాలల అభివృద్ధి శాఖ సౌజన్యంతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని పది ఉన్నత పాఠశాలలకు చెందిన వంద మంది విద్యార్థినులు హైదరాబాద్‌లో ఉన్న ఇస్రో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌ను బుధవారం సందర్శించారు. ఎన్ఆర్ఎస్‌సీ సందర్శనతో విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్ర అభివృద్ధి, శాస్త్రీయ దృక్పథంతోపాటు అంతరిక్ష పరిశోధనల పట్ల ఆసక్తి, అభిరుచి పెంపొందుతాయని డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ తెలిపారు. శాస్త్రీయ సందర్శనకు వెళ్లిన విద్యార్థినుల బస్సులను డీడబ్ల్యూవో రాజమణి ఉదయం ప్రారంభించారు. విద్యార్థులతోపాటు జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్, పావని, సురేష్‌బాబు, కృష్ణారెడ్డి, రవీందర్, శ్రవణ్, పరమేశ్వర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొసరు పనుల్లో జాప్యం

- తొమ్మిదేళ్లు గడుస్తున్నా పూర్తికాని హైవే పనులు
- సర్వీసు రోడ్లను పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు
- జాతీయ రహదారిపై పలు గ్రామాల్లో ఏర్పాటు చేయని సర్వీసు రోడ్లు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి జిల్లా వంగపల్లి నుంచి వరంగల్ జిల్లా ఆరెపల్లి వరకు దాదాపు వంద కిలోమీటర్ల దూరం మేర ఎన్‌హెచ్-163 ఉంది. దీని విస్తరణకు సంబంధించిన అసలు పనులను పూర్తిచేసిన ఎల్‌అండ్‌టీ సంస్థ కొసరు పనులను పట్టించుకోవడం లేదు. కేవలం మెయిన్ రోడ్డు(ఎక్స్‌ప్రెస్ హైవే)పైన దృష్టి పెట్టారు కాని, రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాల్లో సర్వీస్ రోడ్డు, రెయిలింగ్, కొన్ని చోట్లలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు, డ్రెయినేజీ పనులను వదిలేసింది. ఫలితంగా స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రహదారి విస్తరణ పనులు ప్రారంభమైన తర్వాత మూడేళ్లలో వంద శాతం మేర పనులు పూర్తి చేస్తామని ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీ తొమ్మిదేళ్లు కావస్తున్నా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు, పాలకుల అలసత్వంలో నేటికి అనేక చోట్ల అసంపూర్తి పనులు దర్శనమిస్తున్నాయి.

రహదారి విస్తరణ పనులు ప్రారంభం ఇలా...

రహదారి విస్తరణ పనులకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు-4 పథకం కింద 2015లో రూ.1,920 కోట్లను యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులకు మంజూరు చేశారు. 2016 జూన్ 1న అప్పటి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ పనులకు శంకుస్థాపన చేశారు. రహదారి విస్తరణ పనులకు రూ. 897.03 కోట్లు కేటాయించగా మిగతా రూ.1,022.97 కోట్లు భూసేకరణ, గృహాలు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించడానికి కేటాయించారు. ఎల్‌అండ్‌టీ సంస్థ పనులు చేబట్టింది.

యాదాద్రి జిల్లాలోని వంగపల్లి వద్ద నుంచి వరంగల్ జిల్లా ఆరెపల్లి వరకు 99.10 కిలోమీటర్ల మార్గాన్ని 30 నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం 2019 జనవరి 1న పనులు పూర్తి చేయాలని గడువు ఇచ్చింది. గడువు పూర్తయి ఏడేళ్లు కావస్తున్నా నేటికి అనేక చోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

నిబంధనల ప్రకారం చేయాల్సిన పనులు



చిన్నపెండ్యాలలో అసంపూర్తిగా ఉన్న సర్వీసు రోడ్డు

రహదారి విస్తరణ పనుల్లో భాగంగా గ్రామాలు ఉన్న చోట ప్రజల సౌకర్యార్థం సర్వీసు రోడ్లు వేయాలి. సర్వీసు రోడ్డు దాటి ప్రజలు నేరుగా జాతీయ రహదారిపైకి రాకుండా గ్రామాల్లో సర్వీసు రోడ్డు, జాతీయ రహదారికి మధ్యలో ఇనుప కంచెతో రెయిలింగ్ ఏర్పాటు చేయాలి. సర్వీసు రోడ్డు, హైవేకు మధ్య సర్వీసు రోడ్డు పొడవునా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి. ప్రతి గ్రామంలో మినీ బస్ స్టేజీ ఏర్పాటు చేయాలి, సర్వీసు రోడ్డు పక్కన గృహాల్లోకి వర్షం, డ్రెయినేజీ నీళ్లు రాకుండా చర్యలు తీసుకోవాలి.

అసంపూర్తి పనులు ఇవే..

స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని రాఘవపూర్ గ్రామంలో రహదారికి రెండు వైపుల సర్వీసు రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను గృహ సముదాయాల వరకు ఏర్పాటు చేయలేదు. సర్వీసు రోడ్డు ఏర్పాటుకు కంకరపోసి వదిలేశారు. సర్వీసు రోడ్డు లేకపోవడంతో గ్రామస్థులు నేరుగా హైవే పైకి వెళ్లడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. మిగతా గ్రామాల్లో గృహాలు ఉన్న చోట విస్తరణ పనులకు 75 ఫీట్ల వెడల్పు తీయగా రాఘవపూర్‌లో మాత్రం 100 ఫీట్లు తీశారు. అయిన సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు అనేక మార్లు నిరసన వ్యక్తం చేసినా పట్టించుకునేవారే లేరు.

ఘన్‌పూర్‌లో..

ఘన్‌పూర్ బస్టాండ్ నుంచి జనగామ వైపు ఉన్న సర్వీసు రోడ్డు నిరుపయోగంగా మారింది. బస్టాండ్ నుంచి సబ్‌స్టేషన్ వరకు మాత్రమే సర్వీసు రోడ్డు పనులు పూర్తిచేసి అర్ధాంతరంగా నిలిపివేశారు. అక్కడి నుంచి సుమారు 500 మీటర్ల దూరం సర్వీసు రోడ్డును పూర్తి చేయకుండా వదిలేశారు. అక్కడ పిచ్చిమొక్కలు పెరుగగా, మరికొన్ని చోట్ల వ్యాపారులకు అడ్డాగా మారింది. సర్వీసు రోడ్డు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడంతో రోడ్లపైన వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

చిలుపూరు మండల పరిధిలో..

చిన్నపెండ్యాల గ్రామంలో సర్వీసు రోడ్లు సరిగ్గా లేకపోవడంతో వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు రహదారిపైనే ఆర్టీసీ బస్సులు ఎక్కాల్సి వస్తుంది. డ్రెయినేజీ వ్యవస్థ అసంపూర్తిగా వదిలేశారు. సర్వీసు రోడ్డు రద్దీగా మారడంతో కరుణాపూర్ బస్ స్టేజీ వద్ద ప్రయాణికులు రహదారిపైనే బస్సులు ఎక్కాల్సి వస్తుంది.



ఘన్‌పూర్‌లో అసంపూర్తిగా వదిలేసిన సర్వీసు రోడ్డు

రఘునాథపల్లి మండల పరిధిలో..

రఘునాథపల్లి మండల పరిధిలోని నిడిగొండ, కోమళ్ల, గోవర్ధనగిరి గ్రామాల పరిధిలో సర్వీసు రోడ్లు ఉన్నా రహదారిపై హైమాస్ట్ లైట్లు లేకపోవడంతో ప్రజలు రహదారి దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు.

బస్ షెల్టర్లు లేక..

నిబంధనల మేరకు జాతీయ రహదారి వెంట ఉన్న ప్రతీ గ్రామంలో బస్ షెల్టర్లు రెండు వైపులా ఏర్పాటు ఏర్పాటు చేయలేదు. జనగామ నుంచి కరుణాపురం వరకు సుమారు 50 కిలోమీటర్ల రహదారిపై ప్రయాణికుల కోసం షెల్టర్లు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారిపై పెండింగ్ పనులను పూర్తి చేయాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నినదించిన కార్మిక లోకం

సార్వత్రిక సమ్మెలో నిరసనల వెల్లువ

ములుగు రూరల్ (ఆంధ్రజ్యోతి): సార్వత్రి సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రం ములుగులో కార్మికులు బుధవారం నిరసనలు తెలిపారు. ఏఐటీయూసీ, రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్యరైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అమ్జద్ పాషా, సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, కార్మిక సంఘం నాయకులు కొక్కుల రాజేందర్, జక్కుల ఐలయ్య, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

• కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. దీంతో భూపాలపల్లి ఏరియాలోని గనులన్నీ బోసిపోయాయి. ఏరియాలో మొత్తంగా 4వేల పైచిలుకు కార్మికులుండగా 450 మంది మాత్రమే విధులు నిర్వర్తించారు. దీంతో కార్మికులు వారి జీతాల రూపేణా రూ. 1 కోటి 60 లక్షల మేరా నష్టపోవాల్సి వచ్చింది. ఇక 3 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. దీని కారణంగా రూ. కోటిన్నర సంస్థకు నష్టం వాటిల్లినట్టు సింగరేణి అధికారులు అంచనా వేశారు. అలాగే భూపాలపల్లిలోని ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకులు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, సీఐటీయూ, సింగరేణి ఉద్యోగుల సంఘాల నాయకులు జిల్లాకేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో మానవహారంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

• మంగపేట (ఆంధ్రజ్యోతి) :సీపీఎం, సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగపేటలోని పాత బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, కొమరంభీం విగ్రహాలకు వినతిపత్రాలను అందజేసి వినూత్నంగా నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎల్బీముత్యాలు, సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.రవి, టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పూసం నాగేష్, ప్రజా సంఘాల నాయకులు కె.చిరంజీవి, ప్రభావతి, నాగమణి, వసంత, శోభ, పాయం నర్సమ్మ, గోపాల పద్మ, నీలాంబరి, శేషమ్మ పాల్గొన్నారు.

• గణపురం (ఆంధ్రజ్యోతి): కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ) వద్ద విద్యుత్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్ర మంలో 1104, 327, 1535, తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్, ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్, ఆర్టిజన్ జేఏసీ, అకౌంట్స్ సుమారు 22 సంఘాల నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. మండలంలోని కాకతీయ లాంగ్ వాల్ ప్రాజెక్టులో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కేఎల్‌పీలో సింగరేణి ఉద్యోగులు మినహా కార్మికులెవరూ హాజరుకాలేదు. అంతేకాకుండా ఏరియాలోని రామప్ప కాలనీలో కార్మికులు సమావేశమై నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు.

• చిట్యాల (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కార్మికులు, కాంట్రాక్టు సిబ్బంది స్థానిక బస్టాండ్ నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.



భూపాలపల్లిలో కార్మిక సంఘాల మానవహారం

రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజినీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భూక్యా నవీన్, ఆశా కార్యకర్తలు మానస, లక్ష్మి, సాయివేద, జ్యోతి, విశాల తదితరులు పాల్గొన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మెడికల్ సిబ్బంది సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్కూరి నరేందర్, కిషోర్, రమణ, స్వామి, రఘు, సంధ్య, శ్రీకాంత్, మహేందర్, కల్యాణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

• వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తాళ్లపాడు సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సీఐటీయూ నాయకులు అలువాల ఐలయ్య, సంధ్య, ఆశా కార్యకర్తలు అన్నపూర్ణ, మాధవి, సౌజన్య, జ్యోతి, కవిత, శ్రీమతి, రజిత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి):సార్వత్రిక సమ్మె మండలంలో విజయవంతమై ంది. మండల కేంద్రంలోని కేడీసీసీ, టీజీబీ, యూబీఐ బ్యాంకుల ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో కార్యకలాపాలు జరగలేదు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట వైద్యఆరోగ్య సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి సమ్మెకు సంఘీభావం తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు సమ్మె చేశారు. ఈ కార్యక్రమాల్లో మెడికల్ హెల్త్ ఐఎన్‌టీయూసీ-3194 జిల్లా అధ్యక్షుడు స్వామి, కేడీసీసీ మేనేజర్లు హరిరాంనాయక్, వెంకట్రాజం, ఎఫ్‌వో రాజిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఉమ, సిబ్బంది భాస్కర్, తిరుపతి, వైద్యఆరోగ్యసిబ్బంది కృపావరం, సుజాత, లక్ష్మి, పుష్పలత, సాగర్, వెంకన్న, ఇమాన్యుల్, మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

• మహదేవపూర్ : భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఉదారి గట్టయ్య, అయిలి సాంబమూర్తి, అర్జయ్య, సందీప్, వెంకన్న, ఓలి, లక్ష్మణ్, సారయ్య, మహేష్, మధు పాల్గొన్నారు.

• రేగొండ (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తహసీల్దార్ శ్వేతకు వినతి పత్రం అందజేశారు. తమ హక్కులు కాపాడేలా ప్రభుత్వం కనీస వేతనం



మంగపేటలో కుమ్రంభీం విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఇవ్వాలని, కొత్త కోడ్‌లను రద్దు చేయాలని కోరారు.

• టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆశా కార్యకర్తలు, ఆటో కార్మికులు, హమాలీలు సమ్మెలో పాల్గొన్నారు. పలు చోట్ల నిరసనలు తెలిపారు. సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కన్నూరి డానియల్ తదితరులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, గిరిజన సంఘాల మద్దతుతో భారీ ర్యాలీ, బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. దావూద్, అంగన్వాడీ జిల్లా నాయకులు లక్ష్మి, నర్సమ్మ, జ్యోతి, సర్కిల్ లీడర్లు అరుణ, రమాదేవి, ప్రమీల, దేవి, ఆశా వర్కర్ల జిల్లా నాయకులు బొగ్గం సరిత, వెంకటలక్ష్మి, స్వరూప, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు తోలెం కృష్ణయ్య, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు పి. రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకుడు కె. బాలేశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు నాయిని కృష తదితరులు పాల్గొన్నారు.

• గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రాక్షన్‌కమిటీ సభ్యుడు సోమ మల్లారెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు జిట్టబోయిన రమేష్, ముమ్మడి ఉపేంద్రాచారి, నాయకులు పద్మారాణి, కనకలక్ష్మి, ఐలయ్య, సాంబయ్య, సంపత్, అంబాల మురళి, గొంది రాజేష్, వల్లపు రాజు, బ్రహ్మాచారి, సువర్ణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

• వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు ఆయా సంఘాల నాయకులు కట్ల నర్సింహాచారి, కట్ల రాజు, మీనాకుమారి, పార్వతి, అనిత, అరుణకుమారి, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, జీపీ కార్మికులు, మధ్యాహ్న భోజన వర్కర్లు సమ్మెలో పాల్గొన్నారు. పలు చోట్ల ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రఘుపతిరావు, నాయకులు కొండయ్య, బచ్చల కృష్ణబాబు, శాంతకుమారి, దేవమ్మ, సత్యవతి, కుమారి, ముత్తయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కేటీపీపీ ప్రధాన ద్వారం ఎదుట విద్యుత్ ఉద్యోగుల నిరసన



గోవిందరావుపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు



వాజేడులో సీఐటీయూ శ్రేణుల ప్రదర్శన

మంత్రి సీతక్కకు కాంగ్రెస్ నేతల సన్మానం



మంత్రి సీతక్క, కల్యాణిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

తాడ్వాయి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్కను, ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణిని మండల కాంగ్రెస్ నాయకులు గజమాలతో సన్మానించారు. ములుగులో బుధవారం జరిగిన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో సత్కరించారు. కల్యాణిని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేసినందుకు సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, నాయకులు ముజఫర్ , అర్రెం లచ్చుపటేల్, ఇర్ప సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనుల ప్రారంభం

వాజేడు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, హౌజింగ్ ఏఈ ఇస్హాక్ ముగ్గు పోసి నిర్మాణ పనులు చేపట్టారు. నెల రోజుల్లో ఈ నిర్మాణాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఏటూరునాగారం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ములుగు మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎమ్డీ. వలీయాబీ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్డీ. వలీబాబా తండ్రి ఎమ్డీ. జలీల్ ఖాన్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు జలీల్ ఖాన్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్‌బాబు, తాటి కృష్ణ, తాడూరి రఘు, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం : బీజేపీ

ఏటూరునాగారం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నకల్లో బీజేపీ విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు వినుకొల్లు చక్రవర్తి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రజలకు అందించిన పథకాలు, చేసిన అభివృద్ధి ప్రజలు గుర్తించారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మభ్యపెట్టి అధికారలంలోకి వచ్చి చేసిందేమీ లేదని, ఇది ప్రజలు గమనించారని చక్రవర్తి అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పి బీజేపీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మాయమాటలకు ప్రజలు నమ్మే స్థితిలో లేరని, స్థానిక ఎన్నికల్లో బీజేపీ హవా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన జిల్లా అధ్యక్షుడు గండేపల్లి సత్యం, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్ధన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గద్దల హరిబాబు, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఇక మహాలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శులు కందడి ఎలేందర్, కర్ని సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

ములుగు కలెక్టరేట్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు ములుగులో ఘనంగా జరిగాయి. ఏబీవీపీ పూర్వ విద్యార్థి పరిషత్ కార్యకర్త గండ్రకోట కుమార్, వరంగల్ విభాగ్ సంఘటన మంత్రి గుండు పృథ్వీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఏబీవీపీ జెండాను గుండు పృథ్వీ ఆవిష్కరించారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఏబీవీపీ జెండాను సంఘం నగర కార్యదర్శి బుర్ర అభిజ్ఞ ఎగురవేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం ధ్యేయంగా సంఘం పనిచేస్తుందని అభిజ్ఞ తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం సభ్యులు సాయి చరణ్, అజయ్, కృష్ణ శశివర్ధన్, బుర్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీలు, జేసీబీ సీజ్

రేగొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి) : భూ అనుమతి పత్రాలు లేకుండా డంప్ చేసి ఉన్న ఇసుకను లోడ్ చేస్తుండగా రెండు లారీలతో పాటు ఒక జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. సీజ్ చేసిన లారీలను, జేసీబీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహనాల యజమానులు అంకం రాజేందర్, రమేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

పాఠశాలకు మంచినీటి ట్యాంకు

భూపాలపల్లిటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కావాల్సిన మంచి నీటి ట్యాంకును పేరెంట్స్ కమిటీ బుధవారం అందజేసింది. జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయగా పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు వాసాల స్వప్న హాజరై తల్లిదండ్రుల సమక్షంలో ట్యాంకును అందజేశారు.

విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలి

చిట్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత బస్సు సేవలు అందించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబాకు బుధవారం వినతి పత్రం అందజేశారు. జాక్ నాయకులు శీలపాక నాగరాజు, ఫుల్ల అశోక్ సంఘం బాధ్యులు నేరెళ్ల రమేష్, మట్టెవాడ కుమార్, సాద రాకేష్, క్యాతం నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా సీతక్క జన్మదిన వేడుకలు

ములుగు టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు ములుగులోని లీలా గార్డెన్స్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. అనంతరం జిల్లా జనరల్ ఆస్పత్రి ఎదుట అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు.

• మంగపేట (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంత్రి ధనసరి సీతక్క జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి, జిల్లా, నియోజకవర్గ, బ్లాక్ కాంగ్రెస్, మండల, గ్రామ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతి నిధులు వివిద అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మంత్రి ధనసరి సీతక్క జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండలంలోని భూటారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి మంత్రి సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడ ఇర్సవడ్ల వెంకన్న, రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, మాజీ జడ్పీటీసీ చంద్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నిర్సింహారావు, టౌన్ వర్కింగ్



ఏటూరునాగారం మండలంలో భూటారంలో సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, గ్రామ కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

• గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి సుధాకర్, కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, జెట్టి సోమయ్య, పన్నాల ఎల్లారెడ్డితోపాటు పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

• వెంకటాపూర్(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క జన్మదిన వేడుకలను బుధవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డిలు కేక్ కట్‌చేసి నాయకులు,



వెంకటాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కార్యకర్తలకు పంచిపెట్టారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీను,నాయకులు సారంగం, మిల్కూరి ఐలయ్య, మామిడిశెట్టి కోటి, చెన్నోజు శ్రీనివాస్, జంగిలి రవి, మూడ్ వీరేష్‌నాయక్, సలపాని రవీందర్‌రెడ్డి, బండ్ల రాజయ్య, బానోత్ భాస్కర్, పొన్నగంటి రవి, రాజు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఎస్సీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, నాయకులు దాట్ల సీతారామరాజు, తల్లడి ఆదినారాయణ, ఖాజావలి, పాషా, సంజీవ, శ్రీను, ఏసు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు

పుట్ట మధు పరామర్శ

కాటారం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చాచార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పర్యటించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కొత్తపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బోగిరి గంగు మల్లక్క కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కాటారం, పరికిపల్లి, అంకు సాపూర్ గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పాడి రాజబాపు, మునపురి ఐలయ్య, కుమ్మరి సారయ్య, సౌదారి మల్లయ్యలను పరామర్శించి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు జక్కు. రాకేష్, తోట జనార్ధన్, పంతకాని సడువలి, రాజేంద్రచారి, శ్రీలక్ష్మీచౌదరి, రవి, శ్రావణ్, సంతోష్, రాజబాపు, రమణ, రమేష్‌రెడ్డి, అశోక్, బాపు, రాజేష్, తిరుపతి, దేవేందర్, మల్లేష్, దుర్గయ్య, రమేష్, సంపత్, శ్రీనివాస్, లక్ష్మయ్య, లడ్డు, రాజ్‌కుమార్, దేవానాయక్, శివాజీ తదితరులు ఉన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న పుట్ట మధు

స్వయం సహాయక సంఘాలకు

రూ.88.65 లక్షలు మంజూరు

కాటారం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధి పలు గ్రామాల్లో ఉన్న 573 స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)కు ప్రభుత్వం వడ్డీ లేని రుణాల కింద రూ.88,64,884 చెల్లించినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. కాటారం జీపీ పరిధిలోని ఆదర్శజ్యోతి గ్రామైక్య సంఘం సభ్యులకు రూ.5,32,453, సూర్యజ్యోతి వీవో రూ.5,02,699, గారెపల్లి అయ్యప్ప వీవో రూ.2,39,051, నాగజ్యోతి వీవోకు రూ.4, 18,541, శ్రీమహాలక్ష్మి వీవో రూ.4,05,108, శ్రీమల్లి కార్జున వీవోకు రూ.3,46,744, రేగులగూడెం జీపీలో జైశ్రీరాం వీవోకు రూ.4,09,929, కనకదుర్గ వీవో రూ.2,02,702, శ్రీరామాంజనేయ వీవో రూ.3,15,441, గంగారం జీపీలో మారుతి వీవో రూ.99,297, వెలుగులక్ష్మి వీవోకు రూ.1,43, 249, ధన్వాడ జీపీలో సాయికృష్ణ వీవోకు రూ.1,29,523, తిరుమల వీవో రూ.1,47,948, చింతకాని జీపీలో వెలుగు జీవనజ్యోతికి రూ.3,00,082, శ్రీవెంకటేశ్వ రకు రూ.1,35, 795, చిద్నెపల్లి జీపీలో త్రివేణి వీవో రూ.1,69,313, శ్రీరఘురామ రూ.2,692, ప్రతాపగిరి జీపీలో శ్రీలక్ష్మి వీవో రూ.77,007, శ్రీరామ సంఘానికి రూ.75,607 మంజూరయ్యాయి. అలాగే దామెరకుంట జీపీలో దివ్య జ్యోతికి రూ.3,52,454, శ్రీవైష్ణవి వీవో రూ.2,47,972, వరలక్ష్మి రూ.2,03,705, ఒడిపిలవంచ జీపీలో శ్రీవీరాంజనేయ రూ.79,594, భారతి వీవో రూ.37, 366, జాదరావుపేట జీపీలో భాగ్యలక్ష్మి వీవో రూ.1,28,787, శ్రీరామ రూ.66,207, ఆదివారంపేట జీపీలో శ్రీఆంజనేయ రూ.71, 160, వెన్నెల వీవో రూ.59,951, గుండ్రాత్‌పల్లి జీపీలో వెన్నెల రూ.1,46,437, శ్రీరామదాసు రూ.1,06, 200, ధర్మసాగర్ జీపీ శ్రీఆంజనేయ రూ.1,50,572, కొత్తపల్లి జీపీలో శ్రీజ్యోతి వీవో రూ.1,59,166, మణికంఠజ్యోతి రూ.3,78,774, బయ్యారం జీపీలో సాయిజ్యోతి రూ.1,83, 347 వచ్చాయి.

అంకుసాపూర్‌లో నవజ్యోతి రూ.4,64, 882, శంకరంపల్లి జీపీలో జైహనుమాన్ వీవో రూ.3,35, 366, గుమ్మళ్లపల్లిలో శ్రీఆంజనేయ రూ.3,14,863, మద్దులపల్లిలో శివజ్యోతి రూ.62,242, విలాసాగర్ జీపీలో సరస్వతి వీవో రూ.1,30,982, వీరాపూర్ జీపీలో అంజనేయ వీవోకు రూ.98,314, నస్తూరుపల్లి జీపీలో అరుణ జ్యోతి రూ.42,926 జమ అయినట్లు ఐకేపీ అధికారులు తెలిపారు. కాటారం డివిజన్ పరిధి ఐదు మండలాల్లోని 2,005 సంఘాల సభ్యులకు రూ.3.13 కోట్లు వచ్చాయి.